జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 12-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 452 పేజీలు: 4 వెల : రూ.7

# సృష్టి ఫర్టిలిటీ కుంభకోణం మూలాలు.. శ్రీకాకుళంలోనే!

* ఉలిక్కిపడిన శ్రీకాకుళం వైద్య రంగం * తెలంగాణలో కేసు.. దారాలు శ్రీకాకుళం దాకా! * అరెస్టైన రిమ్స్ శ్రీకాకుళం వైద్యురాలు * విశాఖ ఏఎంసీ వైద్యులూ రిమాండ్‌లో! * అరెస్ట్ రోజే సస్పెన్షన్ ఆదేశాలు * వైద్యురాలి సస్పెండ్.. ఇన్నాళ్లు గోప్యం * చివరకు వెలుగులోకి! * "ప్రాణరక్షకులు వ్యాపారం?" ప్రజల్లో చర్చ * పుట్టగొడుగుల్లా పెరిగిన ఫర్టిలిటీ సెంటర్లు




**విశాఖపట్నం/శ్రీకాకుళం, సెప్టెంబర్ 11 (వార్త):** తెలంగాణలో ఎక్కడో మొదలైన ఓ కేసు, ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా దాకా వచ్చి పడింది. రాష్ట్ర అంచున ఉన్న ఈ ప్రశాంతమైన జిల్లా, అక్రమ ఫర్టిలిటీ సెంటర్ వ్యవహారంతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సృష్టి ఫర్టిలిటీ సెంటర్ అక్రమ కార్యకలాపాలపై గత నెలలో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. మొదట ఇది అక్కడి స్థానిక వ్యవహారమే అనుకున్నారు. కానీ విచారణ ముందుకు సాగుతున్న కొద్దీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పేరున్న వైద్యుల పేర్లు బయటకు రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

## వరుస అరెస్టులు

డా. ఆరిమిల్లి విద్యుల్లత, పిల్లల వైద్యురాలు, శ్రీకాకుళం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌కు ఇందులో సంబంధం ఉండటం ఆశ్చర్యం గొలుపుతోంది. ఆమెను ఆగస్టు 5, 2025, మధ్యాహ్నం 1:10 గంటలకు అరెస్టు చేశారు. విషయాన్ని గత నెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలియజేశారు. కానీ ఆమెని సస్పెండ్ చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేసింది. చివరకు ఆమెను సోమవారం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సస్పెండ్ చేయడానికి ఎందుకు ఇంత తాత్సారం జరిగిందని విషయం ఇంకా తెలియడం లేదు. ఈ కేసులో ఇంకా డా. పి. ఉషాదేవి, అసోసియేట్ ప్రొఫెసర్, ఆంధ్రా మెడికల్ కాలేజీ, విశాఖపట్నం, డా. వాసుపల్లి రవి, ప్రొఫెసర్, హెడ్, అనస్తీషియా, ఆంధ్రా మెడికల్ కాలేజీ, విశాఖపట్నం అనే మరో ఇద్దరు వైద్యులు కూడా ఉన్నారు. వీరందరినీ ఆగస్టు 28 వరకూ రిమాండ్ లో ఉంచారు. రిమాండ్ నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సస్పెన్షన్: రూల్ 8(2)(ఖ) కింద వారంతా ఇప్పుడు సస్పెండ్ అయ్యారు.

## మూలాలు శ్రీకాకుళంలోనే?

తెలంగాణలో కేసు మొదలైనా, శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన ఒక డాక్టర్ ఈ కేసులో నిందితురాలిగా ఉండటం, ఈ కేసు రాష్ట్రం మొత్తం మీద సంచలనం సృష్టించింది. "ఎక్కడో తెలంగాణలో కేసు... కానీ మూలాలు మన జిల్లాలోనా?" అనే ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది. సాధారణంగా ప్రశాంతంగా, కేవలం రాజకీయ చర్చలకే పరిమితమయ్యే శ్రీకాకుళం జిల్లాలో ఇప్పుడు వైద్య రంగం గౌరవమే చర్చనీయాంశంగా మారింది. పిల్లల డాక్టర్ పేరుకు మచ్చ తగలడం జిల్లా ప్రజల్లో అసహనాన్ని రేకెత్తిస్తోంది. "ప్రాణరక్షకులు ప్రాణాలపై వ్యాపారం చేస్తారా?" అన్న ప్రశ్నలు ఇప్పుడు గాలిలో తేలుతున్నాయి.

## రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభావం

ఈ కేసు కేవలం కొందరు అరెస్టులతో ఆగిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది వైద్య రంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఒక సవాలుగా మారింది. జాతీయ స్థాయిలో కూడా ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లపై కఠినమైన నియంత్రణలు అవసరమని వాదనలు ఊపందుకుంటున్నాయి. గొప్ప వృత్తిగా గుర్తింపు పొందిన వైద్య రంగం, ఇలాంటి కుంభకోణాలతో దాని ప్రతిష్టను కోల్పోతుందా? అన్న అనుమానం రేకెత్తుతోంది. "జన్మనిచ్చే హక్కు పేరుతో అక్రమాలు కొనసాగితే, సమాజం నమ్మకం ఎక్కడ నిలుస్తుంది?" అనే ప్రశ్న ఇప్పుడు ప్రజాస్వామ్యంలో పెద్ద చర్చకు దారితీసింది.

## జిల్లాలో ఫర్టిలిటీ సెంటర్లు

ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లపైనా అనుమానాలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఈ సెంటర్లలో ఎలాంటి నిబంధనలు పాటిస్తున్నారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ సెంటర్లలో జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. వైద్యం అనేది ఒక వృత్తి కాదు, అదొక సేవ. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన డాక్టర్లు, స్వార్థంతో డబ్బు కోసం అనైతికమైన కార్యకలాపాలకు పాల్పడటం అత్యంత బాధాకరం. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వైద్యురాలు ఈ కుంభకోణంలో ఉండటం జిల్లాలోని వైద్య వ్యవస్థ తల దించుకునేలా చేసింది.

# నేపాల్ టు ఏపీ

* ప్రత్యేక విమానంలో విశాఖ, రేణిగుంట చేరుకున్న 145 మంది యాత్రికులు
* స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, ఎంపీలు
* విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవతోనే చేరుకున్నామన్న యాత్రికులు
* చైనా సరిహద్దులో చిక్కుకున్న మరో 21 మంది తెలుగు వారు






**శ్రీకాకుళం, సెప్టెంబర్ 11(వార్త):** విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ వాసులు నేపాల్ నుంచి విశాఖ చేరుకున్నారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో 145 మంది ఖాట్మాండ్ విమానాశ్రయం నుంచి విశాఖకు చేరారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన వారు 105 మంది, చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన 40 మంది ఉన్నారు. విశాఖ చేరుకున్న వారికి వారి స్వస్థలాలకు వెళ్లేలా కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక బస్సులు, కార్లలో గమ్యస్థానాలకు చేర్చింది. విశాఖ విమానాశ్రయంలో యాత్రికులకు ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, ఆదితి గజపతిరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, కోళ్ల లలిత కుమారి, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పలువురు అధికారులు స్వాగతం పలికారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి లోకేశ్ పర్యవేక్షించారు. అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి సహచర మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్‌తో కలిసి అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని ప్రత్యేక విమానంలో చేర్చారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానం ఖాట్మాండ్ చేరుకుంది. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు 145 మందిని అక్కడి నుంచి తిరిగి విశాఖ, ఆ తర్వాత రేణిగుంటకు చేర్చారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో నేపాల్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన 9 మంది సురక్షితంగా వెనక్కి వచ్చారు. గురువారం రాత్రి వీరంతా విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరిని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక వాహనాల్లో అధికారులు తరలించారు. విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సిక్కోలు వాసులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రభుత్వం తరపున స్వాగతించారు.

చైనా సరిహద్దుల్లో చిక్కుకున్న తెలుగు యాత్రికులు

మానస సరోవరం యాత్రకు వెళ్లిన 21 మంది తెలుగు ప్రజలు చైనా సరిహద్దులో చిక్కుకున్నారు. మానస సరోవరం యాత్ర ముగించుకున్న తర్వాత నేపాల్ మీదుగా భారత్‌లోకి రావాల్సి ఉంది. నేపాల్ అల్లర్ల దృష్ట్యా టూర్ ఆపరేట్ యాత్రీకులను చైనా సరిహద్దులోనే నిలిపివేశారు. దీంతో సొంతూళ్లకు చేర్చాలని వేడుకుంటూ యాత్రికులు వీడియో సందేశం పంపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని కోరారు. యాత్రకు ఏపీ నుంచి 21 మంది వెళ్లగా వారిలో 8 మంది విశాఖ వాసులు కాగా, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌కు చెందిన 13 మంది ఉన్నట్టు సమాచారం.

### కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు
# పటిష్ట భద్రత

* సీసీ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక పర్యవేక్షణ * జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి * ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, జేసీ

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 11(వార్త):** కొత్తమ్మ తల్లి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, ఉచిత క్యూ లైన్లు దర్శనంలో సామాన్య భక్తులు సులభతరంగా అమ్మవారిని దర్శనం చేసుకునేలా పటిష్ట ఏర్పాట్లు జరగాలని ఆలయ నిర్వాహకులను, అధికారులను జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్ర ఆరాధ దైవం కొత్తమ్మ తల్లి అమ్మవారు ఉత్సవాలకు ఏర్పాటు చేయనున్న పటిష్ట బందోబస్తు ఏర్పాట్లును గురువారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, టెక్కలి సబ్ డివిజన్ డీఎస్పీ లక్ష్మణరావు, టెక్కలి రూరల్ సర్కిల్ సీఐ శ్రీనివాస్, కోటబొమ్మాళి పోలీసు స్టేషన్ ఎస్సై సత్యనారాయణ, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 11(వార్త):** ఆర్థిక విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ మండల శాఖ వారు గురువారం కోటబొమ్మాళి ఎంఈవో కార్యాలయం వద్ద రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషన్ను వెంటనే నియమించాలి తక్షణమే ఐర్ ప్రకటించాలి, పెండింగ్‌లో ఉన్న డిఏలను ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మెమో 57ను తక్షణమే అమలు చేయాలని, బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వాసుదేవరావు, నారాయణ రావు, సింహాచలం, ఆనందరావు, మన్మధ రావు, తవితమ్మ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

# వర్గీకరణను వ్యతిరేకిద్దాం..మాలల భవిష్యత్‌ను కాపాడుకుందాం

- ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కి వ్యతిరేకంగా శ్రీకాకుళంలో భారీ ర్యాలీ
- ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకూ పాదయాత్ర
- అధిక సంఖ్యలో పాల్గొన్న మాలలు,రెల్లి సామాజిక వర్గ నాయకులు,ప్రజలు




**శ్రీకాకుళం, సెప్టెంబరు 11(వార్త):** పెరిగిన ఎస్సీ జనాభాకి అనుగుణంగా రిజర్వేషన్లను 20 శాతానికి పెంచాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాలలు, రెల్లిలు వాటి అనుబంధ కులాల వారికి తీవ్రం అన్యాయం జరుగుతున్నందన ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని కోరారు. క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగాలలో ఎస్.సి రిజర్వేషన్ అమలు చేయాలని, దళిత క్రైస్తవులకి రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారు. ఎస్.సి రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, ఎస్.సి, ఎస్.టి దళిత సంఘాల జెఎసి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎస్.సి వర్గీకరణ, క్రిమిలేయర్‌కి వ్యతిరేకంగా శ్రీకాకుళంలో ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకూ పాదయాత్రను భారీ ఎత్తున నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద ఉన్న బాబాసాహెబ్ విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు తొల్లిబిల్లి అశోక్‌బాబు, డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను,క్రిమిలేయర్ ను వ్యతిరేకించి భవిష్యత్ తరాలను కాపాడుకుందామని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చూపిస్తున్న తప్పుడు లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తెలంగాణాలో ఓ దళిత మహిళ ద్వారా హైకోర్టులో కేసు వేయించి క్రిమిలేయర్ ను అమలు చేయాలన్న కుట్రను కాషాయదళాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అనేది సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు లోబడి చేయలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ లబ్ధికోసం కపటనాటకాలు ఆడుతున్నాయన్నారు. భవిష్యత్య తరాలు నష్టపోకుండా ఉండేందుకు సాగుతున్న ఈ పోరాటం అందరూ కలసిరావాలని వారు కోరారు.

కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, శ్రీకాకుళం జిల్లా దళిత సంఘాల జెఏసి నేతలు కళ్లేపల్లి రామ్ గోపాల్, బడియా కామరాజు, డా.కంఠ వేణు, ముంజేటి కృష్ణ, యజ్జల గురుమూర్తి, పొన్నాడ రుషి, దళిత ఉద్యోగుల సంఘ నేతలు ఆర్.వేణుగోపాల్, బోనెల రమేష్ , చల్లా రామారావు, న్యాయవాదులు మురళీకృష్ణ(బిఎంకె), జె. శ్రీనివాసరావు, పురుషోత్తం రాంబాబు,యడ్ల జానకి, నేతల అప్పారావు, సుంకు రమణ,పెయ్యల చంటి ,అరుబారిక రాజు, లక్ష్మణ, రాము, సూర్యనారాయణ, బుడమూరు రామారావు, పంకు మహేష్ ,పంకు మురళీ, అబ్బాస్, శంకర్ , భాస్కరరావు మహిళా నాయకురాళ్ళు లింగాల మల్లేశరి,శీర రాజేశ్వరి, హారతి పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు ముందుగానే దసరా



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** ఆటో కార్మికులకు ముందుగానే దసరా పండగ వచ్చిందని వివిధ ఆటో యూనియన్ల సంఘ గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఆటో కార్మికులకు దసరాకి వాహన మిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు 15000 రూపాయలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తన ఇంటి ఆవరణలో ఆయన వివిధ ఆటో యూనియన్ ముఖ్య నాయకులు కలిసి సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులకు పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు కిర్రి బాబురావు, దాసరి గోపయ్య, పల్లెటి గణపతి, అప్పారావు, బాలకృష్ణ, జగన్, మల్లి, పెడాడ రామారావు, సురేష్, గణేష్, గురునాధ్, సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిదిలో సూదికొండ కాలనీ, రోటరీ నగర్ పై భాగము నుండి ఫారెస్ట్ ఆఫీసు, ఎండిఓ కార్యాలయం మీదుగా శ్రీనివాస నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మురికితో కూడిన కలువ నీరు, వర్షపు నీరు కారణంగా ముంపుకు గురి అవుతున్నాయని గురువారం కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమస్య పై కూటమి నాయకులు టీడీపీ నాయకులు హనుమంతు మురళి మోహన్ దొర, బీజేపీ నాయకులు లక్కోజు ధర్మారావు విజ్ఞప్తి మేరకు మున్సిపల్ కమిషనర ఆ ప్రాంతన్నీ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. సతః సమస్య పై కమీషనర్ తక్షనామే స్పందిస్తూ చర్యలు చేపడతామని డిఇ కనకరాజు, ఏ ఈ అవినాష్ కు పంపించి ఎస్టమేషన్ వేయించి ప్రస్తుతానికి కచ్చి డ్రైన్ ఏర్పాటు చేయిస్తానని కూటమి నాయకులకు ఆ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, మధు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులను వాడాలి : ఐటీడీఏ పీవో పవార్



**సీతంపేట, సెప్టెంబరు11(వార్త):** వ్యవసాయానికి యూరియా కన్నా సేంద్రియ ఎరువులు వాడడం ఉత్తమమని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గురువారం ఆయన సోమగండి గ్రామంలో నిర్వహించిన ఔట్ రీచ్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులకు యూరియాతోపాటు సేంద్రీయ ఎరువులను వాడాలని పీవో సూచించారు. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడం వలన నాణ్యతతో పాటు అధిక దిగుబడి వస్తుందని అన్నారు. యూరియాను అవసరమైనంత మేరకు మాత్రమే వాడాలని సూచించారు. అనంతరం సోమగండిలో ఉన్న అంగన్వాడి సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల యొక్క ఎత్తు, బరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమయ్యే పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతంపేట మండల ప్రత్యేకాధికారి, ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు, మండల తహసిల్దార్ శ్రీకన్య, మండల వ్యవసాయ శాఖ అధికారి వాహిని, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవే లక్ష్యంగా 'హీలింగ్ హార్ట్స్ సేవా సొసైటీ'

**నరసన్నపేట, సెప్టెంబరు 11 (వార్త):** సామాజిక సేవా దృక్పథంతో ప్రోత్సహించడం, విద్యార్థులను విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, విద్యా సంబంధిత వస్తువుల అందజేయడం, వృద్ధులకు ఆహారం ఆరోగ్యం పై అవగాహన కల్పించడం, పర్యావరణ 44 పరిరక్షణ కోసం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ప్రధాన ధ్యేయంగా సేవా కార్యక్రమాలను సేవ ద్వారా అందించేందుకు నరసన్నపేట నియోజకవర్గంలో "హీలింగ్ హార్ట్స్ సేవా సొసైటీ అని పేరుతో ఒక సేవా సంస్థను కె.దిలీప్, కె. శాంతారావు, నాగేశ్వరరావు అనే ముగ్గురు మిత్రుల బృందం ఉమ్మడి కార్యాచరణతో ప్రారంభించారు. నరసన్నపేట నియోజకవర్గ ప్రజలు, రాజకీయ నాయకులు, అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆటో కార్మికులకు ఉపాధి, భద్రత కల్పించాలి




**పలాస, సెప్టెంబరు 11(వార్త):** ఆటో కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ పలాస ఆర్ డి ఓ ఆఫీస్ వద్ద ఆటో కార్మికులు నిరసన తెలుపుతూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి, ఆటో యూనియన్ నాయకులు యం చంద్రశేఖర్, వి కృష్ణారావు, యం ముకుంద మాట్లాడుతూ ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.30,000 ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆటో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్, వాహన విడిభాగాలు, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్టీఏ చాలానాలు పెరగడం వల్ల ఆటో డ్రైవర్లకు పూట గడవడం కష్టంగా ఉందని అన్నారు. కాబట్టి ప్రభుత్వం జోక్యం చేసుకొని సంవత్సరంనకు 30 వేలు ఆర్థిక సాయం ఇవ్వాలని, రోడ్ టాక్స్, టోల్ ఫీజులు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లు 30% శాతానికి తగ్గించాలని పెట్రోల్, డీజిల్ పై పన్నులు, రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. క్యాష్యూ లేబర్ అసోసియేషన్ కార్యదర్శి అంబటి ఆనంద్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు యం తాతారావు, రేవంత్ రెడ్డి, యస్ దిలీప్ జి దుర్యోధన, కె కృష్ణారావు, తో పాటు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## పోలీసులను అభినందించిన బంగారు వర్తకులు

**నరసన్నపేట, సెప్టెంబరు 11(వార్త):** నరసన్నపేటలో బంగారు వ్యాపారి హత్య కేసును ఛేదించిన పోలీసులను బంగారు వర్తక సంఘ సభ్యులు బుధవారం రాత్రి ఘనంగా అభినందించారు. వర్తక సంఘ నాయకులు మాట్లాడుతూ, బంగారు వర్తకులకు భరోసా కల్పించిన పోలీసు సిబ్బందికి ప్రశంసల జల్లు కురిపించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై దుర్గాప్రసాద్ హత్య కేసులో చూపిన చొరవ మరువలేనిదని కొనియాడారు.



# సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని వార్డు సచివాలయం ఉద్యోగులు గురువారం కమిషనర్ నడిపేన రామా రావుని కలిసి వినతిపత్రం సమర్పించారు. అన్ని విభాగాల కార్యదర్శులకు సమాన ప్రమోషన్ల జాబితా తయారు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతము రికార్డు అసిస్టెంట్ క్యాడర్ నుండి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కు ప్రమోషన్ ఇవ్వాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్టేషన్ సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు, బదిలీలపై విధివిధానాలను ఖరారు చేయాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి 15 రోజుల వ్యవధి ఇస్తున్నట్లు సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు తెలియజేశారు. 15 రోజుల తర్వాత తమ డిమాండ్లు పరిష్కరించక పోతే తదుపరి కార్యాచరణ ప్రణాళికను విడుదల చేస్తామని తెలియజేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ మీ యొక్క డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చక్రధర్, తేజ,లావణ్య,ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ముగిసిన మండల స్థాయి పోటీలు



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఎస్‌జిఎఫ్ 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఖోఖో, వాలీబాల్, చెస్ ఎంపికలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. డివిజనల్ స్థాయి పోటీలకు ఖోఖోకు 40, వాలీబాల్‌కు 24, చెస్‌కు 20మంది ఎంపిక య్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.తాతయ్య, పాఠశాల సిబ్బంది కార్యదర్శి పి. కృష్ణారావు, శ్రీకాకుళం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి.తవిటయ్య, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి

**జలుమూరు, సెప్టెంబరు11(వార్త):** ఏపీటీఎఫ్ 1938 సభ్యత్వ నమోదు అల్లాడ, శ్రీముఖలింగం, అచ్యుతాపురం, ఎలమంచిలి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఏపీటీఎఫ్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా సంఘ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు బి రవి, మండల ప్రధాన కార్యదర్శి టి లక్ష్మణరావు, నరసన్నపేట మండల కార్యదర్శి బి.కేశవరావులు పాల్గొన్నారు.

## వంశధార కాలువలో రొయ్యల కోసం వలలు



**జలుమూరు, సెప్టెంబరు11(వార్త):**వేలాది ఎకరాలు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వంశదార ఎడమ కాలువలో ప్రతినిత్యం విస్తారంగా పారుదలకు ఆటంకంగా భారీ వలలు వేస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. కిలో రొయ్యలు 600 నుండి 800 రూపాయల వరకు ధర పలుకుతున్నందున కొందరు యువ కులు వలలు వేస్తూ జీవితాన్ని గడుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ భారీ వలలు వలన కాలువలో ప్రవహించే నీరు స్పీడ్ తగ్గినందున దిగువ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. జలమూరు మండలం పెద్ద దూగాము రాణ సుబ్రమణ్యపురం పలు ప్రాంతాల్లో ఈ వలలు ఉన్నాయని అనంతరం అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ట్రాన్‌ఫార్మరుకు పట్టిన పిచ్చి మొక్కలు



**జలుమూరు, సెప్టెంబరు11(వార్త):** జలుమూరు మండలం జోనంకి గ్రామ ప్రధాన హైవే రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫారం కి భారీ పిచ్చి మొక్కలు తోరణాలు కట్టాయి. ఇటువంటి ట్రాన్స్ఫారానికి ఎంత చెత్తగా పిచ్చి మొక్కలు వేలాడుతున్న ప్రధాన రహదారి పక్కనే ఉన్న అనేకమంది అధికారులు ఇదే రహదారిపై ప్రయాణం సాగిస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడం విద్యుత్ శాఖ అధికారులు తీ రుపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా ఇతర అంశములను చూడవలసిన సం బంధిత అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించా ఎంతో విలువగల ట్రాన్స్ఫర్ ను కాపాడాలని కోరుతున్నారు.

## నేత్ర వైద్య శిబిరం విజయవంతం

**పలాస, సెప్టెంబరు 11(వార్త):** జిల్లా ఆంధత్వ నివారణ సంఘం, శ్రీ వెంకటేశ్వర పుష్ప గిరి కంటి ఆసుపత్రి, విజయనగరం ఆధ్వర్యంలో పలాస మండలం బ్రాహ్మణ తర్ల, గ్రామ సచివాలయం వద్ద, ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం విజయవంతం అయింది. నేత్ర వైద్యం కి సంబందించిన అత్యాధునిక శస్త్ర చికిత్సలు ఆరోగ్య శ్రీ లో ఉచితంగా జరుగుతున్నాయని, కంటి శుక్ల( కాటరక్ట్) ఆపరేషన్ కు ఫాకో సర్జరీ, ఆరోగ్యశ్రీ ద్వారా జరుగుతుందిని, ప్రజలు ఈ అవకాశం నివినియోగించు కోవాలని నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ తెలియ జేశారు. పుష్ప గిరి నేత్ర వైద్య బృందం ఆప్టమ్ లిఖిత పూజిత, నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కంటి పరీక్షలు చెయ్యగ, 11 మందికి కంటి శుక్ల ఆపరేషన్ కోసం రెఫెర్ చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్స్ హరిబాబు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




## 'రణభేరి జాతా'ను విజయవంతం చేయాలి



**మందస, సెప్టెంబరు 11(వార్త):** రణభేరి జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి నిర్వహించనున్న రణభేరి జాతా పోస్టర్ లను మందస మండలంలోని లొహరిబంద, అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ ను వెంటనే నియమించాలన్నారు. పెండింగ్లో ఉన్న డీఏలను ప్రకటించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 15 ఉదయం 9గంటలకు పలాసలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లొహరిబంద పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, అంబుగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతమ్మ, యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు శివకేశవరావు, డి.కిరణ్, ఎస్.రమేష్, మూల చక్రపాణి, గిరిధర్, కె.ధనరాజ్, పి.భాస్కరరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం సమస్యలపై డీఆర్‌వోకు వైసీపీ వినతి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11(వార్త):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ సమస్యలు పై డిఆర్ఓ వెంకటేశ్వరరావు కి వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి లు నర్తు నరేంద్ర యాదవ్ , సాడీ శ్యాంప్రసాద్ రెడ్డి ,తడక జోగరావు లు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గం సోంపేట మండలం బారువ ఆసుపత్రి అసంపూర్తిగా వున్న నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి డయాలసిస్ పరికరాలను వినియోగం లోనికి తీసుకుని రావాలని తద్వారా డయాలసిస్ పేషెంట్ల కు సదుపాయం కలపించమని కోరారు.ఇచ్ఛాపురం గవర్నమెంట్ హైస్కూల్ లో 1800 మంది విద్యార్థులు విద్యాభ్యాసం పొందుతుండగా 38 మంది అధ్యాపక సిబ్బంది ఉండవలసి వుండగా కెవలం 17 మంది మాత్రమే ఉపాధ్యాయులు వున్నారని. ఉపాధ్యాయులు కొరత కారణంగా ఇప్పుడు1100 విద్యార్థులకు హాజరు పడిపోయిందని. అధ్యాపక సిబ్బందిని నియమించి చారిత్రాత్మక ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రతిష్ఠను నిలుపుటకు సరిపడు అధ్యాపక సిబ్బంది నియామకము నకు చర్యలు చేపట్టవలసినదిగాకోరారు. ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల ఊరికి దూరంగా రత్తకన్న దారి నిర్జన ప్రదేశంలో ఉండడం వల్ల, కళాశాల ప్రాంగణం రక్షణ గోడ లేకపోవడం వల్ల రాత్రి పూట అసాంఘిక శక్తులు అసాంఘిక కార్యకలాపాలకు కళాశాల ప్రాంగణాన్ని వాడుకుంటూ ఉదయం విద్యార్థినీ, విధ్యార్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీ కళాశాల కు ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు.కవిటి మండలం దూగానపుట్టుగ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 59 మంది విద్యార్థులు ఉండగా ఏకోపాధ్యాయ పాఠశాలగా నడపపబడుచున్నదని, గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో స్థానిక పెద్దలు, యువకులు పూనుకొని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను దూగానపుట్టుగ ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించారని, ఏకోపాధ్యాయ పాఠశాల అయినందువల్ల తరగతుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని తగిన అధ్యాపక సిబ్బందిని నియమించాలని కోరారు.

## వాల్తేరు రైల్వే డివిజన్ ఏడీఆర్‌ఎంగా కుంద

**మందస, సెప్టెంబరు 11(వార్త):** చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు కుందు రామా రావు. ఉద్దానంలో పుట్టి, పెరిగిన రామారావు ఏకంగా వాల్తేరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించి, భళా అనిపించారు. సోంపేట మండలం లోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన కుందు రామారావు వాల్తేర్ డివిజన్ ఏడిఆర్ఎంగా రైల్వే బోర్డు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ప్రస్తుతం గుంటూరు విజయవాడ దక్షిణ మధ్య రైల్వేలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న రామారావు ఏడీఆర్ఎంగా పదోన్నతి పొందారు. భారతీయ రైల్వేలో ఎన్నో రైల్వే స్టేషన్లో ఇంజనీరింగ్ విభాగంలో ఆధునీకరణ చేసిన అధికారిగా, రైల్వే బోర్డ్ నుండి బుల్లెట్ ప్రూఫ్ రైల్ అధ్యయనానికి భారత ప్రభుత్వం జపాన్ కూడా పంపించిందని రామారావు తెలిపారు. పేదరికం చదువుకు అడ్డు కాదని, యువత మంచిదారిలో కష్టపడి చదువుతే ప్రభుత్వ ఉద్యోగం తప్పనిసరిగా వస్తుందని రామారావు తెలిపారు. ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాల ఎర్రముక్కాం గ్రామంలో, డిప్లోమా పాలిటెక్నిక్ లో సివిల్ పూర్తి చేసి, 2002సంవత్సరంలో బీటెక్ ఆంధ్ర యూనివర్సిటీలో ఆయన పూర్తి చేశారు. బీటెక్ తర్వాత నాలుగు ఉద్యోగాల సంపాదించి రామారావు పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదంటూ ఆల్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసులో 44ర్యాంకు సాధించి, గ్రామీణ ప్రాంత యువతకు పేరణ కల్పించారు. 2006 ఐఈఎస్ బ్యాచ్ లో రామారావు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గా ఆద్ర, నాందేడు రాయపూర్, బిలాస్ పూర్, గుంటూరు, విజయవాడ డివిజన్లో రైల్వేలో ఉత్తమ సేవలు అందించారు. పేదరికం నుంచి వచ్చిన రామారావు చదువు పట్ల శ్రమించి ఐఆర్ఎస్సీ అధికారిగా భారతీయ రైల్వేలో సేవలందించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో ఎన్నో కష్టాలు అనుభవించిన రామారావు ఈ స్థాయికి చేరుకోవడం గ్రామీణ ప్రాంత యువతకి మంచి ఆదర్శమని పలువురు ప్రముఖులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు అభినందించారు. రామారావు తల్లి చంద్రావతి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. అన్నయ్య రాజేష్ ప్రస్తుతం కాశీబుగ్గ తపాలాశాఖలో పోస్టల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య గృహిణిగా తన వెన్నంటూ ఉంటున్నారని రామారావు తెలిపారు.



## జీఆర్ పురం జెడ్పీహెచ్ఎస్‌లో ఆటల పోటీలు



**మందస, సెప్టెంబరు 11(వార్త):** గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి బాల, బాలికల ఆటల పోటీల ఎంపికలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మందస మండలం జి.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి బాల, బాలికల ఆటల పోటీల ఎంపికలలో భాగంగా అండర్-14, అండర్-17 విభాగాలలో మొదటి రోజు ఖోఖోలో 40, వాలీబాల్ లో 30, చెస్ లో 16మందిని డివిజన్ స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రమణమూర్తి మాట్లాడుతూ రాబోయే రోజులలో గ్రామస్థుల, నాయకుల, దాతల సహాయంతో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు ఎస్.రామారావు , పాఠశాల చైర్మన్ వి.కుమార స్వామి, జి.ఆర్.పురం యువ నాయకుడు గొర్లె హరీష్, జోన్-1 పి.ఇ.టి. అసోసియేషన్ సెక్రెటరీ పి.గజేంద్రరావు, జి.ఆర్.పురం మాజీ సర్పంచ్ గుంట నారాయణరావు, దాతలు కిల్లి లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొర్ల పాపారావు, ఉపాధ్యాయుల బృందంతో పాటు మండలంలో అన్ని పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. రెండవ రోజు శుక్రవారం ఆటల్లో భాగంగా కబడ్డీ, యోగా, బాడ్మింటన్ విభాగాలలో ఎంపికలు జరుగుతాయని పీడీ రామారావు చెప్పారు.

## వైసీపీ కార్యకర్తపై దాడి

**జలుమూరు, సెప్టెంబరు 11(వార్త):** శ్రీముఖలింగం లో గురువారం ఉదయం ఐదున్నర గంటలకు వెలమ వీధి దగ్గర బజార్ ఏరియా దగ్గర గతంలో జరిగిన గొడవలకు కక్ష పెట్టుకుని అకారణంగా వైసిపి కార్యకర్త చింతం రాము పై వ్యవసాయ కమిటీ చైర్మన్ టా్రా.బలరాం, అధాని సోదరుడు టా్రా.కృష్ణ కలిసి కర్రలతో దాడి చేసి తీవ్ర గాయపరిచారు. స్థానిక జలుమూరు పి.ఎస్ కి పిర్యదు చేయటానికి వెల్లగ బాధితుడు రాము ని స్థానిక ఏరియా ఆసుపత్రి అయినా బుదితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రనికి ఎం.ఎల్.సి కోసం సిపరాసు చేసారు కాని కేసు నోమధు చేయలేధు డాక్టర్ చికిత్స అనంతరం బాధితుడు 112 కి కాల్చేయగా ఎస్.ఐ అశోక్ బాబు బలరాం మరియు కృష్ణ ల పై కేసు నమోదు చేసారు.



# 10.891 కేజీల గంజాయితో ఇద్దరి అరెస్టు



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** అక్రమంగా తరలిస్తున్న గంజాయితో పాటు ఇద్దరని అదుపులోకి తీసుకున్నట్ల కాశీబుగ్గ డి.ఎస్.పి వెంకట అప్పారావు వెల్లడించారు. గురువారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ కు చెందినవారు రోహిత్, నూరుద్దీన్ లు అదుపులోకి తీసుకొని రెండు సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రోహిత్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తూ ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నట్లు తన స్నేహితుడి మామయ్య అయిన గురూజి అను వ్యక్తిని ఏదైనా ఉద్యోగం లేదా పని ఉంటే చూడండి అని అడుగగా ఒడిస్సా కు చెందిన గురూజీ యొక్క ఫోన్ నెంబర్ ను ఇచ్చి ఒడిషా వెళ్ళి అతనిని కలిస్తే మీకు ఏదైనా పని కలిపిస్తాడని చెప్పగా రోహిత్, నూరుద్దీన్ కలిసి,నూరుద్దీన్ ఒడిషా కు చెందిన గురూజికి ఫోన్ చేయ్యగా వారిని పర్లాఖిమిడి రమ్మని చెప్పాడు. రోహిత్, నూరుద్దీన్ లు మూడు రోజుల క్రితం ఉత్తరప్రదేశ్ లోని వారి స్వగ్రామం నుండి బయలుదేరి పర్లాఖిమిడి చేరుకొని గురూజీని కలవగా, గురూజీ గంజాయిని ప్యాకింగ్ చేసి ఇస్తాను, దానిని విశాఖపట్నం తీసుకొని వెళ్తే అక్కడ కేరళ కు చెందిన ఒక వ్యక్తి వచ్చి తీసుకుంటాడు అని అతని ఫోన్ నెంబర్ ను ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి ప్యాకెట్లను విశాఖపట్నంలో కేరళ నుంచి వచ్చిన వ్యక్తకు అందిస్తే రోహిత్, నూరుద్దీన్‌లకు ఒక్కొక్కరికి 5000 రూపాయలు చొప్పున ఇస్తాను అని గురూజీ చెప్పి నట్లు, తక్కువ సమయంలో అధిక సంపాదన వస్తుం దని రోహిత్, నూరుద్దీన్ లు ఆస్ ఆశపడి ఒప్పుకున్నా రని వెల్లడించారు.

గురూజీ ఇచ్చిన సుమారు 10.815 కేజిల నాలుగు ప్యాకెట్ల గంజాయిని రెండు బ్యాగులలో పెట్టుకొని, పర్లాఖిమిడి నుండి పలాస వరకూ బస్సు లో వచ్చి, పలాస బస్ స్టాండ్ లో దిగి అక్కడనుండి నడుచుకొని పలాస రైల్వే స్టేషన్ కు వస్తుండగా సాయిబాబా మందిరం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీతో పాటు ఎస్ఐ నరసింహా మూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'దీక్షారంభ్'




**పలాస, సెప్టెంబరు 11(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'దీక్షారంభ్' ఇండక్షన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు కష్టపడి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిగ్రీ విద్య అనేది కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాదని, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, నైపుణ్యాల పెంపుదలకు కూడా దోహదపడుతుందని తెలిపారు. కళాశాలలో ఉన్న వనరులను, లైబ్రరీ సౌకర్యాలను, అధ్యాపకుల మార్గదర్శనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, సమయపాలన పాటించాలని, అధ్యాపకులను గౌరవించి కళాశాల లక్ష్యాలు అనుగుణంగా ప్రవర్తించాలని దీక్షను చేయించారు. ప్రతి విద్యార్థి మొక్కవోని ధైర్యంతో ,నిరంతర కృషితో మూడు సంవత్సరాల తదనంతరం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్స్ లో చేరడానికి, బ్యాంకు ఉద్యోగాల్లో, గ్రూప్ 1,2 చేరటానికి ఇప్పటినుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఇండక్షన్ కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంతో విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, కళాశాల వాతావరణానికి, విద్యా విధానానికి అలవాటు పడేందుకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు , పిడి మధు, కామర్స్ అధ్యాపకులు పీవీ రమణ, ఎన్ శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం

**మందస, సెప్టెంబరు 11(వార్త):** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన వారం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మందస మండలంలోని పలు ఉన్నత, ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాల విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. పెండింగ్ డీఏలు విడుదల, పీఆర్సీ కమిటీ నియామకం, ఐఆర్ ప్రకటన, ఉపాధ్యాయులను భోదనకే పరిమితం చేయడం, కేజీబీవీ సిబ్బందికి మినిమం టైంస్కేల్ అమలు, ఆశ్రమ పాఠశాలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన వారం కార్యక్రమం లో రెండవ రోజు 12న మండల కేంద్రంలో సాయంత్రం 4.30గంటలకు జరిగే నిరసన ప్రదర్శనలో కూడా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మందస మండల వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమం లో ఆయా పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ఏపీటీఎఫ్ జిల్లా, మండలశాఖ బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యుదాఘాతంతో ఆటో డ్రైవర్ మృతి



**మందస, సెప్టెంబరు 11(వార్త):** ఫ్యాన్ బాగు చేస్తున్న ఓ యువకుడు విద్యుత్ షాక్ కు గురై మర ణించాడు. బుడారిసింగి పంచాయతీ కురడాలు గ్రామానికి చెందిన సీర రమేష్(35) అనే యువకుడు టేబుల్ ఫ్యాన్ బాగు ఉపక్రమించాడు. విద్యుత్ స్విచ్ ఆఫ్ చేయడం మరిచిన ఆయనకు విద్యుత్ షాక్ కొట్టింది. కుర్చీలో కూర్చొని పని చేస్తుండడంతో తప్పించుకోవడానికి కూడా అవకాశం కలుగలేదు. విద్యుత్ ఘూతానికి గురై కొట్టుకుంటున్న రమేష్ కేకలు విని, భార్య ద్రౌపది వచ్చి విద్యుత్ స్విచ్ ఆఫ్ చేసే చూసే సరికే అప్పటికే ఆయన మరణించినట్టు నిర్ధారించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ ఆటో డ్రైవర్ గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతునికి భార్య సీర ద్రౌపది, కుమార్తె కీర్తి, కుమారుడు సాయి ఉన్నారు. భార్య ఆశా వర్కర్ గా పని చేస్తున్నారు. రమేష్ మరణంతో కురడాలులో విషాదఛాయలు అలముకున్నాయి.



## జేసీఐ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యక్రమాలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11(వార్త):** జేసీఐ వీక్ మూడవ రోజులో భాగంగా క్రీడలు, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిట్ నెస్, యోగ సెషన్ విజయవంతంగా జరిపారు. దాసన్నపేట జంక్షన్‌లోని యూనిటీ ఫిట్నెస్ జిమ్ వద్ద ప్రారంభించారు. ఫిట్‌నెస్ చాలెంజ్‌లు, యోగా అభ్యా సం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని నిర్వహించిన జెసిఐ వీక్ చైర్మన్ జెసి డా. వెచ్చా వాసవి కృషిని అబి నందిస్తూ, ఇలాంటి క్రీడలు మరియు వెల్‌నెస్ కార్యక్రమాలు యువతకు మరియు సభ్యులకు ఎంతో అవసరమని జెసిఐ అధ్యక్షుడు కాళ్ళ జైదేవ్ తెలిపారు. అలాగేయూనిటీ ఫిట్నెస్ జిమ్ మానేజ్మెంట్ కు కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు కాళ్ళ జైదేవ్, జేసీఐ వీక్ చైర్మన్ డా. వెచ్చా వాసవి, జోన్ ఆఫీసర్ టీ షణ్ముఖ్, సభ్యులు ఉలాల శేషు, ఉలాసి శ్యామ్, ఉదయ్, గౌరీ దుర్గాజీ, శిరీష దాస్, రేణుకా దేవి, సంతోష్ సాహు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అవగాహన




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11(వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ ఐ వీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యా రావు, సాయి బాబు,జయలక్ష్మి, ఎన్ని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తియాప్‌ను వినియోగించుకోండి




**జలుమూరు, సెప్టెంబరు 11(వార్త):** జలుమూరు మండలం చల్లవానిపేటలోని ఓ ప్రవేట్ పాఠశాలలో శక్తి యాప్పై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. శక్తి టీం టెక్కలి డివిజన్ ఇన్చార్జి గిరిధర్ ఆధ్వర్యంలో యాప్ డౌన్లోడింగ్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. మహిళా బాలికా సంరక్షణ చట్టాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు గురించి చెప్పారు. జీఎంఎస్కే సభ్యులు, పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



**జలుమూరు, సెప్టెంబరు 11(వార్త):** కరవంజ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను ఎంఈఓ బమ్మిడి మాధవరావు పరిశీలించారు. గురువారం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ దిశగా విద్యా ర్థుల సామర్థ్యాలను నేరుగా పరిశీలించి అభినందించారు. మరింత మెరుగైన సామర్థ్యాలను అలవర్చుకోవాలని వారికి సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యా యుడు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

* రోగులకు సకాలంలో అందని వైద్యం
* సిబ్బందిపై రోగుల బంధువుల ఆగ్రహం

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 11 (వార్త) :** కుక్క కాటు బాధితులకు వైద్య సిబ్బంది చికిత్స చేయడంలో జాప్యం చేయడంతో బంధువులు ఆగ్రహానికి గురయ్యారు. చికిత్సపై ప్రశ్నించడంతో నిర్లక్ష్య సమాధానం ఇవ్వడంతో మండిపడ్డారు. ఈ ఘటన మండలంలో నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం 6 గంటలకు జరిగింది. నౌపడ గ్రామానికి చెందిన రోకళ్ళ రాజేష్ అనే యువకుడు పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావం ఎక్కువ కావడంతో ఉదయం 6 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వస్తే డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ నిర్లక్ష్యం పట్టించుకోలేదు. దీంతో సిబ్బందిపై బంధువులు మండిపడి వెంటనే వైద్యాధికారిణికి ఫిర్యాదు చేశారు. ఓపీలో ఉన్న స్టాఫ్ నర్స్, ఎఫ్ ఎన్ ఓ , అటెండర్ మధ్య గ్రూపు రాజకీయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత గ్రామం, సొంత మండలం గ్రామానికి చెందిన సిబ్బంది కావడంతో పీహెచ్సీకి వస్తున్న వృద్ధులు మరికొందరు రోగులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని బాధితులు నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. పలాస నుండి వస్తున్న ఓ సిబ్బంది ప్రైవేటుగా మందులు తెచ్చి రోగులకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికులు గ్రామ పెద్దల దృష్టిలో పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షించి తగు చర్యలు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546